క్లుప్తంగా

ర్యాలీని విజయవంతం చేయండి

బాడంగి: యోగా మాసోత్సవాల్లో భాగంగా మండల స్థాయిలో యోగాపై ఈనెల 27వ తేదీన నిర్వహించనున్న అవగాహన ర్యాలీని విజయవంతం చేయాలని ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ ఆదివారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ర్యాలీలో మండలస్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, పాత్రికేయులు, విద్యార్థులు, యువత, ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు.

సత్తా చాటిన వెంకటసాయి


వెంకటసాయి వివేక వర్ధ

రాజాం: ఆల్ ఇండియా స్థాయి సైనిక్ స్కూల్ ఎంట్రన్స్ పరీక్షల్లో రాజాం పట్టణానికి చెందిన విద్యార్థి చిప్పాడ వెంకటసాయి వివేక వర్ధ ప్రతిభ కనబరిచాడు. ఆరోతరగతి ప్రవేశానికి సంబంధించి ఏప్రిల్ 5న జరిగిన పరీక్షల ఫలితాలు ఈనెల 22న విడుదలయ్యాయి.300 మార్కులకు నిర్వహించిన ఈ పరీక్షలో విద్యార్థి వెంకటసాయివివేకవర్ధ 268 మార్కులు సాధించాడు. విద్యార్థి తండ్రి సత్యనారాయణ ప్రభుత్వ ఉపాధ్యాయుడు కాగా, తల్లి గాయత్రి ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్‌గా పని చేస్తున్నారు.

సాగులో యాంత్రీకరణపై అవగాహన


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ మురళీకృష్ణ

రేగిడి: వ్యవసాయంలో యాంత్రీకరణ వల్ల సాగు ఖర్చు తగ్గుతుందని, అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఓ జి.మురళీకృష్ణ అన్నారు. సాగులో యంత్రపరికరాల వినియోగం, వాటి వల్ల కలిగే ప్రయోజనాలపై మండలంలోని కోడిశ గ్రామంలో రైతులకు ఆదివారం అవగాహన కల్పించారు. అలాగే భూసార పరీక్షలు నిర్వహించేందుకు రైతుమిత్రలతో కలిసి మట్టి నమూనాలను సేకరించారు. భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా పంటలను సాగు చేసుకోవాలని రైతులకు ఏఓ సూచించారు. వ్యవసాయ సిబ్బంది శరత్‌బాబు, బి.సూర్యనారాయణ, సాయిమణికంఠ తదితరులు పాల్గొన్నారు.

థైరాయిడ్ వైద్య శిబిరం


శిబిరాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ శరత్‌బాబు

బొబ్బిలి: పట్టణంలోని 5,6 వార్డుల పరిధిలో రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన థైరాయిడ్ వైద్య శిబిరం విజయవంతమైంది. శిబిరాన్ని మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్‌బాబు ప్రారంభించారు. 93 మందికి వైద్య సిబ్బంది థైరాయిడ్ పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. రోటరీ క్లబ్ జిల్లా చైర్మన్ జేసీ రాజు,ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు, కౌన్సిలర్ హైమావతి పాల్గొన్నారు.

ఈదురు గాలులతో వర్షం

బాడంగి: మండలంలో ఆదివారం మధ్యాహ్నం ఈదురుగాలులతో వర్షంకురిసింది. ఉదయమంతా ఉక్కపోతతో ఆపసోపాలు పడిన ప్రజలు మధ్యాహ్నం కురిసిన వర్షంతో ఉపశమనం పొందారు.ఈవర్షం వేసవిదుక్కులకు ఎంతో అనుకూలమని రైతులు చెబుతున్నారు.అయితే రబీ వరిపంట నూర్పులు చేస్తున్న రైతులు ఇబ్బంది పడాల్సి వచ్చింది. ఈదురు గాలుల వల్ల కొన్ని ప్రాంతాలకు విద్యుత్‌సరఫరా నిలిచిపోయింది.

ఆనకట్ట ఆధునికీకరణ

పూర్తయ్యేదెప్పుడో..?

- శిథిలావస్థకు చేరిన నారాయణపురం ఆనకట్ట
- తుప్పపట్టిన షట్టర్లు, హెడ్ స్లూయిస్‌లు
- ఆధునికీకరణ పనులు ప్రారంభించామంటూ హడావిడి చేసిన కూటమి ప్రభుత్వం
- రెండు నెలల క్రితమే హెడ్ రెగ్యులేటర్ షట్టర్ల తొలగింపు
- వాటి స్థానంలో కొత్తవి అమర్చకపోవడంతో ఆనకట్టలో నిలవని నీరు
- తూతూమంత్రంగా కాలువలో పూడిక తీత


నారాయణపురం ఆనకట్ట

సంతకవిటి:

మండలంలోని రంగారాయపురం వద్ద నాగావళి నదిపై ఉన్న నారాయణపురం ఆనకట్ట శిథిలావస్థకు చేరుకుంది. ఆనకట్టలో నీటిని నిలబెట్టే ఎనిమిదిహెడ్ స్లూయిస్‌లతో పాటు, ఆనకట్టలో నీటిని కాలువలకు మళ్లించడంలో ప్రధాన భూమిక వహించే షట్టర్ల వ్యవస్థ పూర్తిగా మూలకు చేరింది.118 షట్టర్లు పూర్తిగా పాడైపోయాయి. ఫలితంగా ఆయకట్టుకు సాగు నీరందడం లేదు. గతంలో విడుదలైన రూ.1.12 కోట్ల జైకా నిధులతో ఆనకట్ట ఆధునికీకరణ పనులు చేపడతామంటూ కూటమి ప్రభుత్వం రెండు నెలల క్రితం హడావిడి చేసింది. నదిలోకి, కాలువలోకి నీటిని మళ్లించే హెడ్ స్లూయిస్ తలుపులను తొలగించేశారు. కానీ నేటికి వాటి స్థానంలో కొత్తవి అమర్చలేదు. పాడైన షట్టర్లనూ మార్చలేదు. కాలువల్లో పూడికతీత పనులు కూడా తూతూ మంత్రంగానే చేసి వదిలేశారు. మరికొద్ది రోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుంది. ప్రస్తుతం అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. వర్షాలు ఉధృతంగా కురిసి నదిలోకి నీరు వస్తే పనులు చేయడం కష్టమే. ఇప్పటివరకు ఒక్క షట్టరు కూడా మార్చలేదు. పనులు ఎప్పుడు పూర్తవుతాయో అంటూ ఆయకట్ట రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


అమర్చకుండా వదిలేయడంతో తుప్పు పడుతున్న షట్టర్లు


అమర్చకుండా పక్కన పడేసిన హెడ్ స్లూయిస్ తలుపులు


మల్లయ్యపేట వద్ద గుర్రపు డెక్కతో కుడి ప్రధాన కాలువ

శివారు ఆయకట్టుకు నీరందడం గగనమే

నారాయణపురం ఆనకట్ట విజయనగరం జిల్లా రాజాం నియోజకవర్గంలోని సంతకవిటి మండలం, శ్రీకాకుళం జిల్లా బూర్జ మండలాల్లో ఉంది. 50.50 కిలో మీటర్ల పొడవున్న ఆనకట్ట కుడి ప్రధాన కాలువ ద్వారా రాజాం నియోజకవర్గంలోని సంతకవిటి, ఆమదాలవలస నియోజకవర్గంలోని పొందూరు, ఎచ్చెర్ల నియోజకవర్గంలోని ఎచ్చెర్ల మండలాల్లోని దాదాపు 18,807 ఎకరాలకు సాగు నీరు అందాల్సి ఉంది. అయితే స్లూయిస్‌లు, షట్టర్లు పాడవడంతో ఆనకట్టలో పూర్తిస్థాయిలో నీరు నిలవక పోవడం, కాలువలు పూడికతో నిండిపోవడంతో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో శివారు ఆయకట్టుకు సాగు నీరదడం గగనమే అనిపిస్తోంది. గత ఖరీఫ్ సీజన్‌లో వరి పంటకు నీరందక దాదాపు 10వేల ఎకరాల్లో పంట పొట్ట దశలో ఎండిపోయింది. షట్టర్లను మార్చే పనులతో పాటు కాలువల్లో పూడిక తీత పనులను పూర్తిస్థాయిలో త్వరగా చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

అసలైన విధానాలను పక్కన పెట్టిన టీడీపీ


కరపత్రాలు విడుదల చేస్తున్న శంకరరావు, తదితరులు

బొబ్బిలి: టీడీపీ తన మూల విధానాలను పక్కన పెట్టి మతతత్వ బీజేపీలా వ్యవహరిస్తోందని సీపీఎం పట్టణ కార్యదర్శి పొట్నూరు శంకరరావు ఆరోపించారు. సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీ వరకు నిర్వహించనున్న సమైక్యతా యాత్రకు సంబంధించిన కరపత్రాలను స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ స్థాపించిన టీడీపీ ప్రాథమికంగా లౌకిక పార్టీ అని, దేశ సమైక్యత, మత సామరస్యాన్ని కాపాడేందుకు ప్రతిపక్షాలతో కలిసి గతంలో పోరాడిందన్నారు. కానీ చంద్రబాబు ఆధ్వర్యంలోని నేటి టీడీపీ మతతత్వ పార్టీలతో కలిసి వారి విధానాలను తిరంగ యాత్ర , ర్యాలీల పేరుతో అధికారికంగా నిర్వహించడాన్ని తప్పు పడుతున్నామన్నారు. బీజేపీ చేస్తున్నది ఉగ్రవాద పోరాటమా లేక అమెరికాకు లొంగుబాటా అన్న విషయం ఇప్పుడు చర్చనీయాంశమైందన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా సీపీఎం చేపడుతున్న సమైక్యతా యాత్రలో అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. సీపీఎం మండల కార్యదర్శి ఎస్.గోపాలం, తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో షెడ్డు నిర్మాణం


శ్మశానవాటికలో ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారం నిర్మించిన షెడ్డు

రేగిడి : మండలంలోని సంకిలి గ్రామం నాగావళి నది ఒడ్డున స్థానిక ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారం కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్ఆర్)లో భాగంగా రూ. 8 లక్షలతో శ్మశానవాటికలో షెడ్డును నిర్మించింది. దహన సంస్కరణలు చేసే సమయంలో ఇబ్బందులు లేకుండా ఉండేందుకు షెడ్డు నిర్మించి ఇచ్చిన చక్కెర కర్మాగారం యాజమాన్యానికి ఎంపీటీసీ మజ్జి శ్రీనివాసరావు, సర్పంచ్ బుడుమూరు పట్టాభి, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సత్కారం


సత్కారం పొందిన విద్యార్థులతో మానవతా సంస్థ సభ్యులు

రాజాం సిటీ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహించేందుకే సత్కారాలు చేస్తున్నామని మానవతా సంస్థ చైర్మన్ కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ తెలిపారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతి పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులను స్థానిక సన్‌స్కూల్ ఆవరణలో ఆదివారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మరింత మెరుగైన ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆశీర్వదించారు. పేద పిల్లలను చదువులో ప్రోత్సహించేందుకు మానవతా సంస్థ ద్వారా మరిన్ని కార్యక్రమాలు భవిష్యత్‌లో చేపట్టనున్నామని తెలిపారు. ఎంఈఓ పి.ప్రవీణ్‌కుమార్, మానవతా సంస్థ అధ్యక్షుడు బి.వి.అచ్యుత్‌కుమార్, సభ్యులు ఎస్.సత్యనారాయణ, నీలకంఠయాదవ్, పి.చైతన్య, ప్రసాద్ పాల్గొన్నారు.

డ్రైయిన్‌ను నిర్మించరూ..


మురుగుకాలువలు నిర్మించాల్సిన ప్రాంతం ఇదే

రాజాం: పట్టణంలోని గాంధీనగర్, వాసవీ రియల్ నగర్‌ను ఆనుకుని ఉన్న జనావాసాల వద్ద మురుగు కాలువ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నివాసాల్లోని వాడుకనీరు ఎక్కడికక్కడే ఉండిపోతుంది. పరిసరాలు అధ్వానంగా తయారవుతున్నాయని, దోమలు వృద్ధి చెంది విష జ్వరాల బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఇక్కడ సిమెంట్ కాలువను నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

పుస్తక పఠనం అలవాటు కావాలి


విద్యార్థులతో పుస్తక పఠనం చేయిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

తెర్లాం: విద్యార్థులు ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని స్థానిక శాఖా గ్రంథాలయం అధికారి సీహెచ్.కృష్ణమూర్తి అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక గ్రంథాలయంలో ఆదివారం 'చదవడం మా కిష్టం' కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థు లతో లైబ్రేరియన్ పుస్తక పఠనం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనంతో విజ్ఞానం పెరుగుతుందని, జ్ఞాన సముపార్జనకు పుస్తకాలు ఎంతో దోహదపడతాయని, సమా జం, వివిధ అంశాలపై అవగాహన పెరుగుతుందన్నారు. ఇతిహాసాలు, శాస్త్ర, సాంకేతిక అంశాల సంబంధ పుస్తకాలు, కథలు,నవలలు చదవాలని సూచించారు. గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన చిల్డ్రన్స్ క్లబ్‌లో చేరాలని విద్యార్థులకు సూచించారు.

రోజూ యోగా చేయాలి

ప్రతి ఒక్కరూ రోజూ కొంత సమయం యోగా చేయాలని నెమలాం హైస్కూల్ క్రాఫ్ట్, డ్రాయింగ్ ఉపాధ్యాయుడు విశ్వేశ్వరరావు, లైబ్రేరియన్ సీహెచ్.కృష్ణమూర్తి అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులతో ఆదివారం యోగా చేయించారు. యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని, మానసిక ప్రశాంతత లభిస్తుందని ఉపాధ్యాయుడు అన్నారు.

సాహిత్యంలో పద్యమే హృద్యమైంది


నలచరిత్ర ప్రబంధాన్ని, ఆవిష్కరిస్తున్న గోపాలరావు, రచయితలు

రాజాం సిటీ:

వెయ్యేళ్ల క్రితం నుంచి వస్తున్న పద్య మే తెలుగు సాహిత్య ప్రక్రియలన్నింటికీ హృద్యమైందని, అది చిరంజీవి అని ఆంధ్ర వైయాకరణ వాచస్పతి డాక్టర్ ఏ.గోపాలరావు అన్నారు. స్థానిక శ్రీకాకుళం రోడ్డులోని హోటల్ కల్కీఇన్‌లో రాజాం రచయితల వేదిక సమావేశం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గోపాలరావు కళింగాంధ్రకు చెందిన బెహరా రామకృష్ణ కవి 200 ఏళ్ల క్రితం రచించిన 'నలచరిత్ర' అనే ప్రబంధాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెయ్యేళ్లకుపైగా సాగిన తెలుగు సాహిత్య చరిత్రను తరచి చూస్తే నేటికీ హృద్యమైనది పద్యమేనని అన్నారు. రామకృష్ణ కవి రచించిన నలచరిత్ర ప్రబంధం అద్భుతమని అన్నారు. నేటి కవులు, రచయితలు ప్రాచీన సాహిత్యాన్ని బాగా అధ్యయనం చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పేర్కొన్నారు. ఆధునిక సాహిత్యకర్తలలో పేరుగాంచిన శ్రీశ్రీ, ఆరుద్ర, గురజాడ, గిడుగు రామ్మూర్తి పంతులు, తాపీ ధర్మారావు వంటి వారంతా ప్రాచీన సాహిత్యాన్ని బాగా చదివారని గుర్తుచేశారు. వేదిక నిర్వాహకులు గార రంగనాథం అధ్యక్షతన జరిగిన సమావేశంలో రచయితలు కొత్తా భాగ్యలక్ష్మి, కుప్పిలి రామకృష్ణ రంగారావు, మేడూరి సూర్యసత్యనారాయణమూర్తి, కొత్తా రమేష్, మధుసూధనరావు, పిల్లా తిరుపతిరావు, ఒమ్మి రమణమూర్తి, తనికెళ్ల లక్ష్మీనారాయణమూర్తి, మంగిపూడి శ్రీనివాసరావు, సమతం మహేశ్వరరావు, పొట్నూరు కోటిబాబు, రౌతు గణపతిరావునాయుడు, పి.చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే బంగారు భవిష్యత్


విద్యార్థులను సత్కరిస్తున్న డీఎస్పీ భవ్యారెడ్డి, తదితరులు

- డీఎస్పీ భవ్యారెడ్డి

బొబ్బిలి: విద్యతోనే పిల్లలకు బంగారు భవిష్యత్ సాధ్యమని, విద్యార్థులను ప్రోత్సహించడం కోసం సమాజంలో అంతా ముందుకు రావాల్సిన అవసరం ఉందని డీఎస్పీ జి.భవ్యారెడ్డి అన్నారు. పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ముస్లిం విద్యార్థుల అభినందన సభతో పాటు కెరీర్ గైడెన్స్ కార్యక్రమాన్ని స్థానిక షాదీ ఖానాలో హుదా ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. అతిథిగా హాజరైన డీఎస్పీ విద్యార్థులకు మెమెంటోలు ప్రదానం చేసి, దిశానిర్దేశం చేశారు. మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్‌బాబు, కారుణ్య ఫౌండేషన్ అధ్యక్షుడు జేసీ రాజు, హుదా అధ్యక్షుడు మహ్మద్ రఫీ, కార్యదర్శి షేక్ జాఫర్, మదరసా పాఠశాల ప్రిన్సిపాల్ అబుల్ కలాం, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు రియాజుల్లా ఖాన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు పురస్కారాలు


విద్యార్థినికి నగదుతో పాటు జ్ఞాపిక అందజేస్తున్న రాజు

సంతకవిటి: పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన మండలంలోని వాల్తేరు ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులకు ఆ గ్రామంలోని ఆర్కే గ్రంథాలయ వ్యవస్థాపకులు, పాతపట్నం సబ్ రిజిస్ట్రార్ గురుగుబెల్లి రాజు ఆదివారం నగదు పురస్కారాలు అందజేశారు. పాఠశాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన విద్యార్థులు బొడ్డేపల్లి అంకిత, పప్పల సుకన్య, గొల్లపల్లి శివకు నగదుతో పాటు జ్ఞాపికలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో మరింత ఉత్తమ ఫలితాలు సాధించి, ఉన్నత స్థాయిలో నిలవాలని ఆశీర్వదించారు.

- రేషన్ డోర్‌డెలివరీని నిలిపివేసిన కూటమి ప్రభుత్వం
- సరుకుల కోసం రేషన్ డిపోలకు వెళ్లాల్సిందే
- ఉపాధి కోల్పోయిన ఎండీయూ వాహన ఆపరేటర్లు
- కొన్ని గ్రామాల ప్రజలకు తప్పని రేషన్ పాట్లు

మళ్లీ రేషన్ కష్టాలు..!


సంతకవిటి మండలం రంగారాయపురంలో ఎండీయూ వాహనం ద్వారా ఇంటివద్ద రేషన్ సరుకులు తీసుకుంటున్న లబ్ధిదారులు(ఫైల్)


తమను తొలగించవద్దని రేగిడి మండలంలో రెవెన్యూ అధికారులకు వినతిపత్రం ఇస్తున్న ఎండీయూ వాహన ఆపరేటర్లు(ఫైల్)

రాజాం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన రేషన్ డోర్ డెలివరీ విధానాన్ని నిలిపివేస్తూ కూటమి ప్రభుత్వం తాజాగా నిర్ణయం తీసుకుంది. జూన్ నెల నుంచి పాత పద్ధతిలో రేషన్ డిపోల వద్దే సరుకులు తీసుకోవాలని చెప్పడంతో రేషన్ షాపుల వద్ద గంటల తరబడి నిరీక్షించే రోజులు మళ్లీ ప్రారంభమయ్యాయని లబ్ధిదారులు...తమ జీవనోపాధి కోల్పోతున్నామని మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్(ఎండీయూ) ఆపరేటర్లు వాపోతున్నారు. ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ పంపిణీ వ్యవస్థ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నెలకొల్పింది. ఈ విధానం వల్ల ప్రజలకు గంటల సమయం రేషన్ డిపోల వద్ద క్యూలో ఉండాల్సిన పరిస్థితి తప్పింది.కొన్ని గ్రామాల ప్రజలకు ఒక గ్రామం నుంచి మరో గ్రామంలోని రేషన్ డిపో వద్దకు వెళ్లి రేషన్ తెచ్చుకునే కష్టాలు తప్పాయి. ఎండీయూ వాహనాల ఆపరేటర్లు చౌకధరల దుకాణాల నుంచి రేషన్ సరుకులు తీసుకొచ్చి ప్రతీ నెల 1వ తేదీ నుంచి 5వ తేదీలోగా గ్రామాల్లో లబ్ధిదారులకు ఇళ్ల ముంగిటే రేషన్ సరుకులు అందించే వారు. దీంతో లబ్ధిదారులకు నిరీక్షణ తప్పడంతో పాటు సమయం ఆదా అయ్యేది. సిగ్నల్, బయోమెట్రిక్ సమస్యలతో పాటు రేషన్ బియ్యాన్ని మోసుకుని వెళ్లాల్సిన ఇబ్బందులు తప్పేవి.సరుకులు కూడా సక్రమంగా అందేవి. ఇప్పుడు ఈ వాహన సేవలు నిలిపి వేస్తుండడంతో రేషన్ లబ్ధిదారులకు కష్టాలు మళ్లీ ప్రారంభమైనట్లే.

నియోజకవర్గంలో 55 వాహనాల ద్వారా..

రాజాం నియోజకవర్గంలో రాజాంలో 19, రేగిడిలో 15, సంతకవిటిలో 13, వంగరలో 8 వాహనాల ద్వారా రేషన్ డోర్ డెలివరీ చేసే వారు. రేషన్ డోర్ డెలివరీ ప్రక్రియలో ఎండీయూ ఆపరేటర్లు(వాహనాల డ్రైవర్లు) ప్రధాన పాత్ర పోషించేవారు. వీరు చదువుతో పాటు డ్రైవింగ్‌లో శిక్షణ పొందిన అభ్యర్థులు కావడంతో రేషన్ పంపిణీ సులభంగా ఉండేది. వీరికి గత ప్రభుత్వం నెలకు రూ. 21 వేల జీతం ఇచ్చేది. ఇందులో రూ.3వేలు వ్యాన్ ఈఎంఐ పోగా, రూ.18వేలు అందేవి. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత వీరికి జీతాలు సకాలంలో అందకపోగా, ఇప్పుడు వీరిని పూర్తిగా తొలగించేస్తోంది. దీంతో వీరి జీవితం అగమ్యగోచరంగా మారింది. ఇప్పుడు తాము ఎక్కడకి వెళ్లాలి ఏం చేయాలో తోచడం లేదని వారంతా వాపోతున్నారు. 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని ఎన్నికల సమయంలో చెప్పిన కూటమి పెద్దలు ఇప్పుడు ఉన్న ఉద్యోగాలు తీసేస్తుండడంతో యువతలో నైరాశ్యం, వ్యతిరేకత కనిపిస్తోంది.

సమయం ఆదా అయ్యేది



ఇదివరకు మా ఇంటివద్దకే రేషన్ తెచ్చేవారు. సకాలంలో రేషన్ సరుకులు పొందడంతో పాటు ఎటువంటి కాలయాపన ఉండేదికాదు. సమయం ఆదా అయ్యేది. ఈ మొబైల్ వ్యాన్‌లు తీసేస్తే మేం 3 కిలోమీటర్లు దాటి మరో గ్రామానికి వెళ్లి రేషన్ సరుకులు తెచ్చుకోవాల్సి ఉంటుంది.

– భూపతి వెంకటరమణ, రంగారాయపురం, సంతకవిటి మండలం

పోరాడతాం...



ఎండీయూ ఆపరేటర్ల జీవితాలతో ప్రభుత్వం ఆడుకోవద్దు. ఉన్నపళంగా మమ్మల్ని రోడ్డు మీద పడేస్తే ఊరుకునే ప్రసక్తే లేదు. ఎండీయూ ఆపరేటర్లు అంతా కలసి విజయవాడవెళ్తాం. డిప్యూటీ సీఎంతో పాటు పౌరసరఫరాలశాఖ మంత్రిని కలిసి వినతిపత్రం ఇస్తాం. అప్పటికీ స్పందించకపోతే మా జీవితాలకు సరైన మార్గం చూపేవరకూ పోరాడతాం.

– పొట్నూరు శ్రీనివాసరావు, ఎండీయూ ఆపరేటర్ల యూనియన్ అధ్యక్షుడు, రేగిడి మండలం

ప్రభుత్వం జీఓ జారీచేసింది

ఎండీయూ వాహన సేవలను నిలుపుదలచేసి, రేషన్ డిపోల వద్దే రేషన్ ఇవ్వాలని ప్రభుత్వం జీఓ జారీచేసింది. ఈమేరకు ఈ వాహన సేవలు నిలుపుదల చేస్తున్నాం. వాటిని ఆయా మండలాల తహసీల్దార్ కార్యాలయాల ద్వారా ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుంది.

– చిరంజీవి, సీఎస్‌డీటీ, రాజాం

రెండు కిలోమీటర్లు వెళ్లాలి



ఇదివరకు మా ఇంటి వద్దకే రేషన్ సరుకులు వచ్చేవి. ఎటువంటి ఇబ్బంది ఉండేది కాదు. ప్రభుత్వం రేషన్ బళ్లను ఆపేసిందని తెలిసింది. ఇకపై మేము మళ్లీ పాతరోజుల్లో మాదిరిగా మా గ్రామం నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న చంద్రమ్మపేట రేషన్ డిపోకు వెళ్లాలి. పనులు మానుకుని వేరే గ్రామం వెళ్లాలంటే కష్టమే.

– చౌదరి నారాయణరావు, చౌదరివలస, వంగర మండలం

నాలుగున్నరేళ్లు సేవలందించాం..



మొబైల్ వ్యాన్ ఆపరేటర్లుగా నాలుగున్నరేళ్లపాటు సేవలు అందించాం. ఈ ఉద్యోగం భవిష్యత్‌లో బాగుంటుందని ఇతర ప్రాంతాల నుంచి స్వగ్రామానికి వచ్చేశాం. ప్రతీ నెల మాకు రూ. 21 వేల జీతం వచ్చేది. ఇంతవరకూ బాగానే పని చేసుకున్నాం. మమ్మల్ని ఇప్పుడు అర్ధంతరంగా తొలగించడంతో ఏమి చేయాలో తోచడంలేదు. మా జీవితంలో మళ్లీ కష్టాలు ప్రారంభమవుతున్నట్లు అనిపిస్తోంది.

– పొట్నూరు రవి, ఎండీయూ ఆపరేటర్, చింతలపేట, సంతకవిటి మండలం

అంబేడ్కర్ అడుగుజాడల్లో నడవాలి..


అంబేడ్కర్ విగ్రహాన్ని, ప్రారంభిస్తున్న అద్దూరి సీతబాబు, స్థానిక ప్రజాప్రతినిధులు

గుర్ల: యువత అంబేడ్కర్ అడుగుజాడల్లో నడుచుకోవాలని అంబేడ్కర్ ఇండియన్ మిషన్ జిల్లా అధ్యక్షుడు అద్దూరి సీతబాబు అన్నారు. మండలంలోని గుజ్జింగివలసలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అంబేడ్కర్ అందరివాడని.. విద్యార్థులు , యువత ఆయన్ను ఆదర్శంగా తీసుకుని ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రతి గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు అంబేడ్కర్ ఇండియన్ మిషన్ సంస్థ కృషి చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు కెల్ల భీమారావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు అట్టాడ రామకృష్ణ , మాజీ సర్పంచ్ గొర్లె రాముడునాయుడు, తదితరులు పాల్గొన్నారు.